క్లుప్తంగా

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

బేతంచెర్ల: జాతీయ గ్రంథాలయాల వారోత్స వాలను పురస్కరించుకుని గ్రంథాలయ అధికారి మధుశేఖర్ ఆధ్వర్యంలో మంగళ వారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పట్టణంలోని ధరణి టౌన్ షిప్పు ఆవరణలో జరిగిన పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల ముగ్గులతో ఆక ట్టుకున్నారు. గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు.

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

కోవెలకుంట్ల: క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమని అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు సూచించారు. మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో అందరికీ క్యాన్సర్ పరీక్షలు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో ప్రజలకు బీపీ, షుగర్, అనీమియా, టీబీ, కుష్టు, క్యాన్సర్‌కు ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, గిరిజ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల: ప్రతి ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లను వాడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎస్సీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఎంఈఓ అబ్దుల్ కలాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణతో కలిసి కాలనీలో ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించకపోతే అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందని సూచించారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదన్నారు. ఇళ్ల వద్ద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన బాబాఫకృద్దీన్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల-ఆళ్లగడ్డ ఆర్ అండ్‌బీ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన బాబాఫకృద్దీన్, ఉసేన్‌సా బైక్‌పై కోవెలకుంట్ల వైపు వస్తుండగా ఇదే మండలం చాకరాజువేములకు చెందిన రహిమాన్ కోవెలకుంట్ల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా పట్టణ శివారులోని పేరా బిల్డింగ్స్ వద్ద బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా అటుగా వెళుతున్న ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో బాబాఫకృద్దీన్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు



బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన శ్రీధర్‌గుప్తా సత్యసాయి జిల్లాకు చెందిన ప్రభుత్వ భూములను బనగానపల్లెలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలియడంతో ఈ నెల 15న ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. దీంతో నంద్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

నివాళి


శ్రీరాములు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: పట్టణంలోని కొండపేటలో హత్యకు గురైన చాకలి శ్రీరాములు మృతదేహానికి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఎక్కడి పనులు అక్కడే!

- నిలిచిపోయిన నాడు-నేడు పనులు
- నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- ఇబ్బందుల్లో విద్యార్థులు

నియోజకవర్గంలో రెండో విడత నాడు-నేడు పనులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు

మండలం	పాఠశాలలు	కోట్లలో
కొలిమిగుండ్ల	37	రూ.17
అవుకు	27	రూ.9.67
కోవెలకుంట్ల	26	రూ.9.55
సంజామల	27	రూ.4.12
బనగానపల్లె	48	రూ.18.8


బెలుంలో అసంపూర్తిగా ఉన్న గదిలోనే విద్యార్థులకు తరగతులు,


కొలిమిగుండ్లలో ఆగిపోయిన నిర్మాణ పనులు

కొలిమిగుండ్ల: నాడు-నేడు రెండో విడత పాఠశాలల్లో చేపడుతున్న పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎన్నికల వరకు సజావుగా సాగిన పనులు ఆ తర్వాత ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పాఠశాలల్లో జరుగుతున్న ఆధునీకరణ పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. విద్యా సంవత్సరం మొదలై ఐదు నెలలు గడుస్తున్నా నిధుల సమస్యతో పనుల్లో పురోగతి లేకుండా పోయాయి. అసంపూర్తిగా పనులు ఆగిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో చేపట్టిన పనులతో పాఠశాలలు సకల సౌకర్యాలతో అందంగా మారిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. రెండో విడత పనులు 60 శాతంపైగానే పూర్తయ్యాయి. ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాలు

బనగానపల్లె నియోజవర్గంలోని ఐదు మండలాల్లో నాడు-నేడు కింద రెండో విడతలో 165 పాఠశాలలు ఎంపిక కాగా వాటి అభివృద్ధి కోసం రూ.59.14 కోట్ల నిధులు మంజూరు చేశారు. మొదటి విడతలో 88 పాఠశాలలు ఎంపిక కాగా రూ.16.99 కోట్లతో అన్ని పనులు పూర్తి చేయడంతో పాఠశాలలు కొత్తకళను సంతరించుకున్నాయి. రెండో విడతలో మంజూరైన పనుల్లో సైతం చాలా పాఠశాలల్లో 60 శాతానికి పైగానే పూర్తయ్యాయి. ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు అసంపూర్తిగా మారడంతో విద్యార్థులు గదులు లేక అవస్థలు పడుతున్నారు. బెలుం ఉన్నత పాఠశాలలో గదులు లేకపోవడంతో అసంపూర్తిగా ఉన్న భవనంలోనే పాఠాలు బోధించాల్సి వస్తోంది. చాలా చోట్ల ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులు చేస్తే పూర్తవుతాయి. మరికొన్ని చోట్ల టాయ్‌లెట్ల పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. నిధుల సమస్య లేకుంటే ఈ పాటికి అన్ని పనులు పూర్తయి వాడుకలోకి రావాల్సి ఉంది. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మధ్యలో ఆగిపోయిన పనులకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

> **నిధులు లేక నిలిచిపోయాయి**
>
> రెండో విడత నాడు-నేడు పనులకు ప్రస్తుతం నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయగానే పాఠశాలల్లో పనులు మొదలు పెడుతాం. చాలా పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయి.
>
> –అబ్దుల్ కలాం, ఎంఈఓ.

ఈరోజు

దయల్ యువర్ డీఎం

డోన్ టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం దయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 9959225795 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని గాంధీనగర్, అయ్యప్పస్వామి గుడి, కురుకుందు కాలనీ, డాక్టర్ పోచా ప్రభాకర్‌రెడ్డి నగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మార్పు పనుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

52 మందికి వైద్య పరీక్షలు

ప్యాపిలి: పట్టణంలోని నాలుగో సచివాలయం పరిధిలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి వాణిశ్రీ 52 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఐదు ఇళ్లను సందర్శించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది రాఘవేంద్ర గౌడ్, గంగాదేవి, మల్లీశ్వరి, శోభా, అమర్ పాల్గొన్నారు.

పంచాయతీ పరిపాలనపై అవగాహన


మాట్లాడుతున్న డీపీఓ జమీవుల్లా

బనగానపల్లె రూరల్: గ్రామ పంచాయతీ పరిపాలనపై ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో డోన్ డివిజన్‌లోని ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పరిపాలన, యాప్‌లపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీపీఓ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం స్పందనలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. డోన్ డీఎల్‌పీఓ బాలకృష్ణుడు పీఆర్-యాప్‌తో పాటు గ్రామ పరిపాలనకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.

మిరపను ముంచెత్తిన ఎస్సార్బీసీ నీరు


మిరపపైరులో ప్రవహిస్తున్న కాల్వనీరు

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడు గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న ఎస్సార్బీసీకి మంగళవారం అధికంగా నీటిని విడుదల చేయడంతో కాల్వ నీరు మిరప పంటను ముంచెత్తింది. గ్రామానికి చెందిన ఉసేన్ ఎకరా రూ. 50 వేలు కౌలు చెల్లించి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రెండున్నర ఎకరాల్లో మిరప పంట సాగు చేశాడు. మిరపనార, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఇప్పటి వరకు రూ. లక్షకుపైగా వెచ్చించాడు. ప్రస్తుతం పైరు పూత, కాయ దశలో ఉంది. ఈ తరుణంలో ఏడో బ్లాక్ కాల్వకు అధికంగా నీటిని విడుదల చేయడంతో పొలాల వెంట కాల్వ నీరు ప్రవహిస్తోంది. నీరంతా మిరపలో చేరడంతో పైరు దెబ్బతిని నష్టం చేకూరిందని బాధిత రైతు వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

శనగ పంటలో యాజమాన్య పద్ధతులు


గుళ్లదూర్తిలో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: మండలంలో రబీ సీజన్‌లో సాగైన పప్పుశనగ పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం మండలంలోని గుళ్లదూర్తి, పొట్టిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి, కంది, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వాతావరణ ప్రతికూల పరిస్థితులతో శనగను మొదలుకుళ్లు, ఎండుతెగులు ఆశించి మొక్కలు చనిపోతున్నట్లు గుర్తించామన్నారు. తెగుళ్లకు సంబంధించిన శిలీంద్రకారకం భూమిలో ఉండి పైరుకు నష్టం చేకూరుస్తోందని తెలిపారు. నివారణ చర్యగా సాఫ్‌పౌడర్ లేదా హెక్సాకొనజోల్ వంటి తెగులు నివారణ మందులను పిచికారీ చేయాలని పేర్కొన్నారు. రబీ పంటల నమోదు మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుందని రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

అవుకు: కోత దశలో ఉన్న వరికి వివిధ రకాల తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని.. రైతులు తప్పనిసరిగా నివారణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. మండల పరిధిలోని గుండ్లశింగవరం, అన్నవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ఉష్ణోగ్రతలు 18–20 డిగ్రీలు, గాలిలో తేమ 90శాతం, వర్షపు జల్లులు అగ్గి తెగులు వ్యాప్తికి అనుకూలమన్నారు. అలాగే మెడవిరుపు తెగులు వల్ల సగం నిండిన గింజలు లేక తాలుగా ఏర్పడతాయన్నారు. అగ్గి తెగులు నివారణకు 0.6గ్రాముల ట్రైసైక్లోజోల్ 75శాతం లేదా 1.5మి.లీ ఐసోప్రోథయోలేన్ 40శాతం మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

వైద్యశాలలో సౌకర్యాల కల్పనకు కృషి


శేషారెడ్డి సీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించారు. రోగుల సౌకర్యార్థం ఎమ్మెల్యే తనయుడు కోట్ల రాఘవేంద్రారెడ్డి వైద్యశాలకు 15 బెడ్లు, ఐవీల్ స్టాండ్‌లు అందజేశారు. 25 కేవీ జనరేటర్, బెడ్ సైడ్ ర్యాక్స్, ఆర్వో ప్లాంట్, ఎక్స్‌రే, యూఎస్‌జీ మెషిన్ అవసరమని వైద్యురాలు సాగరిక ఎమ్మెల్యేకు విన్నవించారు. చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

24 నుంచి పద్మనాభస్వామి ఆరాధనోత్సవాలు

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడులో వెలసిన దిగంబర అవధూత పద్మనాభస్వామి ఆశ్రమంలో ఈ నెల 24వ తేదీ నుంచి 34వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు ఆరాధనోత్సవాలు కొనసాగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన

ప్యాపిలి: హక్కుల సాధన కోసం ఎరుకల కులస్తులు ఐక్యం కావాలని ఏపీ ట్రైబల్ ఫెడరేషన్ నాయకులు మరమేసి పరమేశ్, మీధు అన్నారు. స్థానిక ఏకలవ్య విగ్రహం వద్ద మంగళవారం విగ్రహావిష్కరణ నాలుగో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ నాయకులు సుధాకర్, శేషాద్రి, శ్రీనివాసులు, శేఖర్, రాముడు, వెంకటేశ్, సుంకన్న పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళల మార్పు సరికాదు

కోవెలకుంట్ల: రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పు చేయడం సరికాదని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు. మంగళవారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలు మార్చాలని చూడడం భావ్యం కాదన్నారు. ప్రస్తుతం ఉన్న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల పనివేళలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు అన్ని విధాలా శ్రేయస్కరమన్నారు. పనివేళల మార్పు గ్రామీణ విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోన్ రూరల్: ఆటో బోల్తా పడి ఇద్దరు మహిళలు గాయపడిన ఘటన మంగళవారం మండల పరిధిలోని ఇంద్రాంపల్లి గ్రామం వద్ద జరిగింది. కూలీ పనులకు వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన మహిళలను డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బనగానపల్లె రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ సుజాత, సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో మహిళా దినోత్సవం-మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంతో మంది మహిళలు ఉన్నత పదవుల్లో ఉన్నారని.. వారిని నేటి తరం మహిళాలు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్, డాక్టర్లు సుజాత, మైథిలి, సీడీపీఓ ఉమామహేశ్వమ్మ, ఎంఈఓ స్వరూప పాల్గొన్నారు.

నీటి కోసం సచివాలయం ముట్టడి


సచివాలయాన్ని ముట్టడించిన గుడిపాడు కాలనీవాసులు

ప్యాపిలి: మండలంలోని గుడిపాడు ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం కాలనీవాసులు సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడారు. ఎస్సీ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనడంతో కాలనీ వాసులు పడుతున్న బాధలు వర్ణనాతీతం అన్నారు. గ్రామ శివారు ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాజకీయ నాయకులు కేవలం ఎన్నికల సమయంలో కాలనీకి వచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తారని తర్వాత కాలనీ వైపు కన్నెత్తి చూడరని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి తక్షణమే స్పందించి ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో సచివాలయ సిబ్బంది సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశారు. సమస్యను 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

బీమాతో జీవితానికి ధీమా


మాట్లాడుతున్న ఎల్ఐసీ కడప డివిజనల్ మేనేజర్

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా 2047 కంతా దేశంలోని 140 కోట్ల జనాభాలో ప్రతి ఒక్కరికి బీమా సౌకర్యం కల్పించే బాధ్యత ఉద్యోగులు, ఏజెంట్లు తీసుకోవాలని ఎల్ఐసీ కడప డివిజనల్ మేనేజర్ రవికుమార్ అన్నారు. మంగళవారం డోన్ బ్రాంచీని సందర్శించిన ఆయన ఉద్యోగులు, ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఎల్ఐసీ సేవలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇంటి నుంచే అన్ని రకాల సేవలు పొందవచ్చని తెలిపారు. డోన్ బ్రాంచ్ మేనేజర్ రాముడు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు


స్వాధీనం చేసుకున్న సారా, బైక్‌ను చూపిస్తున్న సీఐ

డోన్ రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం వివరాలను వెల్లడించారు. ప్యాపిలి మండలం అలేబాద్‌తండా గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన ముదావత్ శేఖర్‌నాయక్ మద్యం అమ్ముతుండడంతో అరెస్టు చేశామని తెలిపారు. అతని వద్ద నుంచి 80 లీటర్ల నాటుసారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ఐలు దౌలత్‌బాస్, సోమశేఖర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, బషీర్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కోవెలకుంట్ల: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో ఆడ పిల్లలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్నారన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహాలు జరిపించడం అన్ని విధాలా శ్రేయస్కరమని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. హెచ్ఎం అరుణ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు


సంజామల: బాల్యవివాహాలు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని..చిన్న తనంలోనే పెళ్లిళ్లు చేసి వారి జీవితాలను నాశనం చేయొద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలు, పోక్సో యాక్ట్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారం చేస్తే పదేళ్ల జైలు, జరిమానా, జీవిత ఖైదు విధించే అవకాశం ఉందన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నరసింహారెడ్డి

డోన్: 'స్కూల్ కాదు సచివాలయమే' అనే శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. డీఎల్‌డీఓ నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ స్థానిక గాంధీ నగర్ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ అడ్మిన్, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్, హెల్త్ సెక్రటరీ, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ సెలవులో ఉన్నారని తెలిపారు. మిగిలిన సిబ్బంది ఎన్‌పీసీఐ లింకేజీ, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ కోసం ఫీల్డుకు వెళ్లారని వివరించారు. ఆ సమయంలో కొందరు పిల్లలు కార్యాలయంలోకి ప్రవేశించారన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.


పొలాలపై మంచు పొరలు


సూర్యుడు కనిపించకుండా కప్పేసిన దట్టమైన మంచు

మంచు దుప్పట్లో అవుకు


చెర్లోపల్లె రహదారిలో లైట్ల వెలుతురులో వెళ్తున్న లారీ

మండల కేంద్రంలోని ఇళ్లు, పొలాలు, రహదారులను మంచు కప్పేసింది. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. పక్క ఇల్లు సైతం కనిపించనంతగా పొగమంచు కమ్ముకుంది. మేఘాలు కిందకు వచ్చాయా అనేలా పంట పొలాలపై మంచు పొరలు కప్పేశాయి. మంగళవారం ఉదయం 8 గంటలైనా సూర్యకిరణాలు పడలేదు. దట్టమైన పొగమంచులో లేత నారింజ రంగులో సూర్యుడు ప్రజలను కనువిందు చేశాడు. –అవుకు

కార్తీక వనభోజనం



స్థానిక నెహ్రూ నగర్‌లోని డాక్టర్ రామసుబ్బయ్య మున్సిపల్ పార్కులో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పూల శ్రీను, డిష్ మహేష్, అశోక్ పాల్గొన్నారు. – డోన్